కథ

# సహజం

అకెళ్ల సూర్యనారాయణ మూర్తి
92474 95346

బ్రహ్మీ ముహూర్తం.. అలారం మోగడంతో బద్ధకం వదిలించుకుంటూ నెమ్మదిగా లేచి కూచున్నాను. మహానగరంలో ఉరుకులు పరుగుల జీవితాలు.. ఇంత పొద్దున్నే లేచినా, ఆఫీసుకి బయలుదేరే సమయానికి..

'మీవల్లే లేట్ అయింది..' అంటే.. 'నీకే టైమ్‌సెన్స్ ఉండదు' అంటూ.. నేనూ రేవతి అరుచుకోవడం కూడా అలవాటుగా జరిగేదే.

సుప్రభాతం వింటూ అరచేతులు రుద్దుకున్నాను.

ఆవలిస్తూ మంచం దిగబోతుంటే..

''గేటు తాళంతీసి నీళ్లు పెట్టండి. గుమ్మంలో ముగ్గేస్తాను''.. దుప్పటి ముసుగు తీయకుండానే చెప్పింది సతీమణి.

కళ్లు నులుముకుని బెడ్రూంలోంచి హాల్‌లోకి వచ్చి.. పూజామందిరంలో దేవుడికో నమస్కారం చేసి నిత్యకృత్యాలలో పడ్డాను. ఇద్దరి మొబైల్ ఫోన్లు చార్జింగ్ కోసం పెట్టడంతో రోజు మొదలైనట్టే. ఊపిరి తీయడం క్షణం ఆలస్యమైనా ఫర్వాలేదు, చేతిలో మొబైల్ లేకపోతే మాత్రం ఊపిరి ఆగిపోయినట్టే.

రోజంతా ఎంత హడావుడిగా గడిచిపోయినా, పొద్దున మాత్రం మా రెండో అంతస్తు బాల్కనీలో ఎదురెదురు కూచుని నేనూ, రేవతి టీ తాగుతాం. అయితే ఒక చేతిలో టీ గ్లాస్, రెండో చేతిలో మొబైల్ ఫోన్లు ఉంటాయి. రాత్రి ఆలస్యంగా వచ్చిన వాట్సాప్ సందేశాలు, మెయిల్, మిస్డ్‌కాల్స్ అన్నీ చకచకా చూసేసి కొన్నిటికి సమాధానాలు ఇస్తూ, కొన్ని వదిలేస్తూ, ఇంటి వ్యవహారాలు మాట్లాడుకోవడం కూడా జరిగిపోతాయి. ఇదంతా పూర్తిచేసి లేవబోతుంటే నా మొబైల్ మోగింది. ఆ రోజు తనకి ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి సమావేశం ఉందట. రోజూ కన్నా త్వరగా బయలుదేరాలని చెప్పి కాల్ త్వరగా పూర్తి చేయమని సైగలు చేసి.. రేవతి లోపలికి వెళ్లిపోయింది. తనకి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం.

ఆ కాస్తలోనే రెండు మిస్డ్‌కాల్స్. ఒక వాట్సాప్ కాల్.. న్యూజెర్సీ నుండి మోహన్ చేశాడు. ఇంటర్‌లో ఇద్దరం కలిసి చదువుకున్నాం. తను ఇంజినీరింగ్ చేశాడు. ఎమ్మెస్ కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోయాడు. నాకు ర్యాంక్ సరిగారాక డిగ్రీ పూర్తిచేసి.. అతి కష్టమ్మీద ప్రభుత్వ ఉద్యోగంలో చేరగలిగాను. ఎప్పుడు ఇండియా వచ్చినా, ఎంత బిజీగా ఉన్నా.. మొబైల్‌లో తప్పనిసరిగా పలకరించేవాడు. సమయం చూస్తే ఆరు అవుతోంది. అంటే నిన్న రాత్రి ఎనిమిదిన్నర అక్కడ. ఆలోచనల్లో ఉండగానే మళ్లీ ఫోన్ మోగింది.

''సారీ సూర్యా! పొద్దునే ఇబ్బంది పెడుతున్నాను'' అవతల మోహన్ గొంతులో ఆందోళన.

''ఏమైందిరా''

''అమ్మకి సీరియస్‌గా ఉందిరా.. గంట క్రితమే నాన్న ఫోన్‌చేశారు. మెట్రోసిటి హాస్పిటల్‌లో ఐసీయూలో ఉంది. క్రిటికల్ అని చెప్పారు. వీలైనంత త్వరగా బయలుదేరే ప్రయత్నం చేస్తున్నాను. మలేషియాలో ఉన్న మా చెల్లెలు సుధ రేపు బయలుదేరుతోంది. అక్కడ నాన్నగారు ఒక్కరే ఉన్నారు. నీకు ఏమాత్రం వీలున్నా''.. ఆగాడు మోహన్.

ఈ మధ్యకాలంలో తన మాట కాదనలేక వాళ్ల అమ్మానాన్నల అనారోగ్య కారణాల కోసం.. దాదాపు అయిదారుసార్లు సెలవు పెట్టి వెళ్లాల్సి వచ్చింది.

''సర్లే రా! వెళ్తాను'' నా ప్రమేయం లేకుండానే జవాబు చెప్పాను.

తనొచ్చేలోగా ఖర్చుల కోసం ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపిస్తానన్నాడు. క్షణాల్లో పెద్దమొత్తం నా బ్యాంక్ అకౌంట్‌లోకి చేరినట్టుగా మొబైల్‌లో సందేశం కూడా వచ్చింది.

''ఎవరు? ఆ ఆన్‌లైన్ మోహనేనా? ఇంత పొద్దునే ఫోన్‌చేస్తే ఆయనే అనుకున్నాను.. వాళ్లకి పడకేసే టైమ్, మనకి పరిగెత్తే టైమ్! మన హడావుడి తెలిసికూడా మీరు చెప్పరు. ఆయన అనుకోడు. ఈసారి.. ఎవరికి బాగోలేదట? అలాంటప్పుడేగా మీరు గుర్తొస్తారు.. మళ్లీ సెలవు పెడుతున్నారా?'' కిచెన్‌లోంచే రేవతి అరిచింది.

''ఆంటీకి.. అస్సలు బాగోలేదు. వెంటిలేటర్ పెట్టారట! మోహన్ బయలుదేరుతున్నాడు. రేపు వాళ్ల చెల్లెలు వస్తోంది.. అంకుల్ ఒక్కరే ఉన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బు కూడా ట్రాన్స్‌ఫర్ చేశాడు..'' విషయమంతా నెమ్మదిగా చెప్పాను.

''ఇదంతా సరే.. ఎప్పుడూ మీకే

